మరోమారు జగనే సీఎం

- అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు
- మార్చి 18 నుంచి 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిగా ఎన్నుకునేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. వంద మంది చంద్రబాబులు, పవన్ కల్యాణ్‌లు వచ్చినా వైఎస్సార్‌సీపీ గెలుపును ఆపలేరన్నారు. భీమిలి మండలం చిప్పాడలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశం నియోజకవర్గ పరిశీలకుడు పి.బాలరాజు సమక్షంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ మార్చి 18 నుంచి ప్రారంభం కానున్న 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో అనుసరించాల్సిన వ్యూహాన్ని వివరించారు. సంక్షేమ పథకాలకు ఆద్యుడైన వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతన్నలకు రుణమాఫీ వంటివి అమలు చేస్తే తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిని నిర్వీర్యం చేశారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ మూడున్నరేళ్లలో విద్యార్థులు, రైతులు, మహిళలు అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. మళ్లీ చంద్రబాబుకు పొరపాటున అవకాశం ఇస్తే ఇప్పుడున్న పథకాలకు మంగళం పాడి వలంటీర్ల వ్యవస్థను తొలగించి, సచివాలయ ఉద్యోగులను భయాందోళనలకు గురి చేస్తారన్నారు. ''దళితులుగా పుట్టాలని ఎవరూ కోరుకోరని, బీసీల తోకలు కత్తిరిస్తానని, కోడలు కొడుకును కంటే అత్త వద్దంటుందా'' అని చంద్రబాబు గతంలో విమర్శలు చేసినట్టు గుర్తు చేశారు. ప్రజలను మభ్యపెట్టి, భయపెట్టి ఓట్లు వేయించుకోవాలని చంద్రబాబు చూస్తే... సీఎం జగన్ ప్రేమతో అన్నివర్గాల ప్రజలను అక్కున చేర్చుకుంటున్నారన్నారు.

82960 82960కు మిస్డ్‌కాల్ ఇప్పించండి...

నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు పి.బాలరాజు మాట్లాడుతూ ప్రతి 50 ఇళ్లకు వెళ్లే కన్వీనర్లు, గృహ సారథులు గత చంద్రబాబు పాలనలో, ఇప్పటి సీఎం జగన్ పాలనలో అందుతున్న సంక్షేమ పథకాల లబ్ధిని అడిగి తెలుసుకోవాలన్నారు. వారు జగనన్న పాలనతో సంతృప్తి చెందితే 82960 82960కు మిస్డ్ కాల్ ఇప్పించాలని సూచించారు. జగనన్నే మా భవిష్యత్ అనేలా రాష్ట్ర ప్రజలు ఉన్నారన్నారు. సంక్షేమ పథకాల విషయంలో ప్రతిపక్షాలు సోషల్ మీడియా లేదా ఇతర వేదికలపై చర్చకు రావాలని డిమాండ్ చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఇప్పటికే వైఎస్సార్ సీపీ ప్రజల పక్షాన ఉందన్నారు. ఇప్పుడు గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి జగన్ పాలనలోని ప్రగతిని వివరించాలని కోరారు. సమావేశంలో భీమిలి ఏఎంసీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు వెంపాడ రమావతి, గాడు వెంకటనారాయణ, సమ్మిడి శ్రీనివాసరావు, మజ్జి సూరినాయుడు, చెల్లూరి నగేష్, సీనియర్ నాయకులు దుంపల నాగమణి, పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, చిల్ల హరి, తుపాకుల అప్పలరాజు, బొడ్డు దుర్గారావు, వెంపాడ సూరిబాబు, తోట ఎల్లారావు, కొయ్య రమేష్, కొల్లి కోటిరెడ్డి, మేరుగు ఎల్లాజీ, ఉండబట్ల చిన్నారావు, తుపాకుల అప్పలస్వామి, గాడు తాతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పారిశుధ్య పనుల పరిశీలన



పాత పీఎంపాలెంలో డ్రెయిన్ పరిశీలిస్తున్న జెడ్సీ కనక మహాలక్ష్మి

పీఎం పాలెం: పాత పీఎం పాలెంలో జోన్ – 2 జెడ్సీ కనక మహాలక్ష్మి బుధవారం పర్యటించి పారిశుధ్య పనులు పరిశీలించారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలంగాలని సిబ్బందిని ఆదేశించారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా జీవీఎంసీ పారిశుధ్య వాహనాలకు అందజేసి పారిశుధ్యం మెరుగుపరచడంలో భాగస్వాములు కావాలని కోరారు. పాలిథిన్ కవర్లు వినియోగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు స్థానిక సమస్యలు ఆమెకు తెలియజేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



బియ్యం స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు నేరెళ్లవలసలో నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఈ ప్రాంతానికి చెందిన దుర్గ ఉగ్రనరసింహ మూర్తి ఇంట్లో నిల్వ చేసిన 1100 కేజీల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ సీఐ భారతి బుధవారం సీజ్ చేసి కేసు నమోదు చేశారు. బీచ్ రోడ్డు, మారికవలస ప్రాంతాల్లో బియ్యం అక్రమ రవాణా స్వేచ్ఛగా సాగుతోందని, నిఘా ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.

రచ్చబండ తొలగించిన టీడీపీ నాయకుడు



రచ్చబండ తొలగిస్తున్న దృశ్యం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు జేవీ అగ్రహారం పరిధిలో గల బోరపేట గ్రామంలో ఏళ్ల తరబడి ఉన్న రచ్చబండను స్థానిక టీడీపీ నాయకుడు తొలగించారు. సర్వే నంబరు 58/2లో 70 గజాల స్థలంలో ఇక్కడ ఉన్న చెట్టుకు ఆనుకుని ఉన్న రచ్చబండను తొలగించి ఆక్రమించుకున్నారు. ఈ క్రమంలో స్థానికులు అడ్డుచెప్పగా వారిపై దౌర్జన్యం చేశారు. 70 సంవత్సరాల నుంచి ఊరి సమస్యలు, తగాదాలు, ఇతర కార్యక్రమాల ప్రణాళికలు ఈ రచ్చబండపైనే జరిగేవని, ఇది పూర్వం నుంచి వస్తున్న ఆచారమని స్థానికులు తెలిపారు. మరోవైపు రచ్చబండను తొలగించి స్థలాన్ని ఆక్రమించుకున్న బోర సోమయ్యపై స్థానికులు ఫిర్యాదు చేశారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

భీమునిపట్నం: భీమిలి ప్రాంతంలో విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేస్తుండడంతో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ సకరయ్య తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు భీమిలి చిన్నబజారు, రాయపాలెం, రేఖవానిపాలెం, మహాలక్ష్మిపురం, ఎలంపేట, బ్యాంక్ కాలనీ, దెక్కతిపాలెం, మూలకుద్దు, మరడపాలెం, కీతిన్‌పేట, పారిశ్రామిక వాడ ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

ఫిష్ ఆంధ్ర మార్కెట్‌పై అవగాహన

తగరపువలస: తాటితూరు స్వదేశీ ఫిషర్‌మెన్ సహకార సంఘం ఆధ్వర్యంలో చిట్టివలస పెద్ద చెరువు వద్ద మత్స్యకారులకు ఫిష్ ఆంధ్ర మార్కెట్‌పై బుధవారం అవగాహన కల్పించారు. సంఘం అధ్యక్షుడు సింగిడి గణేష్ ఆధ్వర్యంలో ఫిషరీస్ విభాగం అధికారులు సుమాంజలి, రమేష్ తదితరులు మాట్లాడారు. సబ్సిడీ, పరిశుభ్ర వాతావరణం, అవుట్‌లెట్ల కమీషన్, లాభాలపై వివరించారు.

'లిప్'తో మంచి ఫలితాలు



రికార్డులు పరిశీలిస్తున్న తిరుపతినాయుడు



సంతపేట అంబేద్కర్ హైస్కూల్‌లో అధికార బృందం

భీమునిపట్నం: చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(లిప్) ద్వారా మంచి ఫలితాలు వస్తాయని ఈ ప్రోగ్రాం రాష్ట్ర పరిశీలకులు తిరుపతినాయుడు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో 6 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న వెనుకబడిన విద్యార్థుల కోసం అమలు చేస్తున్న లిప్ తీరును బుధవారం పరిశీలించారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఆయనతోపాటు యునిసెఫ్ ప్రతినిధి సుదర్శన్, ప్రధానోపాధ్యాయురాలు ఎం.శివమణి ఉన్నారు.

తగరపువలస: ప్రభుత్వ పాఠశాలల్లో అమలతున్న లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా రాష్ట్ర ప్రతినిధి బృందం సంతపేట అంబేద్కర్ జీవీఎంసీ హైస్కూల్‌ను బుధవారం సందర్శించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ ఎం.ఎస్.ఆర్.శర్మ, విజయనగరం డైట్ ప్రిన్సిపాల్ ఎన్‌టీ నాయుడు, పరిశీలకుడు రాంబాబు 6, 7, 8 తరగతులను పరిశీలించారు. అభ్యసన అభివృద్ధి కోసం బోధన పీరియడ్, ప్రాక్టీస్ పీరియడ్లుగా విభజించి అమలు చేయడం వల్ల విద్యార్థుల్లో గణనీయమైన అభ్యసన స్థాయి పెరుగుతుందన్నారు. ఉపాధ్యాయుల పాఠ్యాంశ ప్రణాళికను పరిశీలించారు. లిప్ రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జగన్నాథస్వామి పాల్గొన్నారు.

గృహ సారథులతో సమావేశం నేడు

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి కల్యాణ మండపంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కె.రాంబాబు తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హాజరవుతారని తెలిపారు.

దిష్టిబొమ్మలు దహనం చేసిన వారిపై కేసు

పద్మనాభం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ఈ నెల 14న దిష్టిబొమ్మలు దహనం చేసిన ఆరుగురిపై సీఐ సన్యాసినాయుడు కేసు నమోదు చేశారు. మద్ది పంచాయతీకి చెందిన కనకల శ్రీను, బుగత వెంకటరావు, బుగత అప్పన్న మరో ముగ్గురు వ్యక్తులు ఎంపీపీ, సీఐ, తహసీల్దార్ దిష్టిబొమ్మలు దహనం చేశారన్నారు. మద్ది వీఆర్వో ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్టు తెలిపారు. మద్ది గ్రామంలో సర్వేనంబర్ 224/1లో కనకల సన్యాసమ్మ భర్త సత్యం మృతి చెందడంతో అతని పేరున ఉన్న 58 సెంట్ల స్థలానికి 39 సెంట్లకు పాస్‌బుక్ చేయగా మిగిలిన 19 సెంట్లు వేరే వ్యక్తులు ఆక్రమించుకుని విక్రయించారు. దీనికి సంబంధించి మంగళవారం దిష్టిబొమ్మలు దహనం చేసినట్టు తెలిసింది.

సకాలంలో సస్యరక్షణతో ప్రయోజనం



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ఆనందపురం : పంటను చీడపీడలు ఆశించినప్పుడు వెంటనే సస్య రక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. అనకాపల్లి రైతు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు విశాలాక్షి, గౌరీ కుమారి, శిరీషతో కూడిన బృందం మండలంలోని బోని గ్రామంలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు రబీ వరిపంట పొలంబడి ప్లాట్‌లను క్షేత్ర స్థాయిలో రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సకాలంలో పంటపై మందులు పిచికారీ చేయడం వల్ల నష్టం ఎక్కువ కాకుండా కాపాడుకోవడానికి అవకాశం ఉందన్నారు. వరి పంటలో పొటాష్ లోపం ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. ఈ మేరకు చిరు పొట్టదశలో ఎకరానికి 25 కిలోలు యూరియా, 20 కిలోల పొటాష్‌తో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి, ఏడీఏ సీహెచ్.సుబ్రహ్మణ్యం, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శ్రీ నాయక్, వ్యవసాయాధికారి సంధ్యారత్న ప్రభ పాల్గొన్నారు.

కత్తెర పురుగు నివారణకు సూచనలు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీలో అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు విశాలాక్షి, శిరీష, గౌరీకుమారి బుధవారం పర్యటించారు. మొక్క జొన్న పంటపై కత్తెర పురుగును పరిశీలించారు. దీని నివారణకు లీటరు నీటికి 0.4 గ్రాముల ఇమామెక్టిన్ బెంజోమేట్ కలిపి 200 లీటర్ల ద్రావణాన్ని ఎకరా పంటపై పిచికారి చేయాలని సూచించారు. అలాగే మెటారైజియం అనిసోప్లియా కిలో చల్లాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఈవో జి.రమ, అభ్యుదయ రైతులు నరసింహారావు, వేణు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల ఆందోళన



బీచ్ రోడ్డులో ఆందోళన చేస్తున్న చిరు వ్యాపారులు

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డులో తోపుడు బళ్లను అధికారులు బుధవారం తొలగించడంతో చిరు వ్యాపారులు ఆందోళన చేశారు. ఇక్కడ వరుసగా బడ్డీలు ఉండగా వాటికి ముందు తోపుడు బళ్లు, చిన్న బల్లలను ఏర్పాటు చేసుకుని పలువురు వ్యాపారాలు చేస్తున్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారడంతో అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) శ్రీనివాస్ ఆధ్వర్యంలో వీటిని తొలగించే కార్యక్రమం చేపట్టారు. దీనిపై ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఉన్న బడ్డీలను తొలగించలేదని, వాటికి ముందు తోపుడు బళ్లు ఏర్పాటు చేయడంతో ఇబ్బందికరంగా ఉండడంతో తొలగిస్తున్నామని తెలిపారు. బీచ్ ప్రాంతాన్ని సుందరీకరించడంలో భాగంగా అధికారుల ఆదేశాల మేరకు ఈ పనులు చేపట్టామని వెల్లడించారు. రోడ్డును ఆక్రమించుకుని ఇలా వ్యాపారాలు చేయడం వల్ల బీచ్‌కు వచ్చేవారికి ఇబ్బందిగా ఉందన్నారు. ఎవరికీ ఇబ్బంది కలగనిచోట కార్లు, ద్విచక్ర వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

మహా శివరాత్రి ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు



మానం ఆంజనేయులు నగర్‌లోని మహా కామేశ్వర స్వామి ఆలయం



ఉత్సవాలకు సిద్ధమైన మహా కామేశ్వర స్వామి

మధురవాడ: మహా శివరాత్రి ఉత్సవాలకు మధురవాడలోని శివాలయాలు ముస్తాబవుతున్నాయి. మధురవాడ ఐటీ సెజ్ జంక్షన్‌లోని మానం ఆంజనేయులు నగర్‌లోని శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత మహా కామేశ్వర స్వామి దేవాలయంలో గురువారం నుంచి మూడు రోజులపాటు ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కమిటీ అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్ చెప్పారు. గురువారం ఉదయం 8 గంటలకు సంకల్పం, విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. శుక్రవారం లలితా త్రిపుర సుందరీ అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు, సాయంత్రం 108 కళశాలు స్థాపన, ఇతర కార్యక్రమాలు ఉంటాయన్నారు. శనివారం ఉదయం 4.30 గంటల నుంచి ప్రధాన లింగమూర్తికి ఏకవార అభిషేకాలు, సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. మధురవాడ సిద్ధేశ్వర స్వామి పీఠం, మిథిలాపురి వుడా కాలనీలోని రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం వేకువజాము నుంచే అభిషేకాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

రక్షణ గోడ విరగడంతో ప్రమాదకరం



బీచ్‌రోడ్డు వద్ద రక్షణ గోడ విరిగిపోయిన చోట ప్రమాదకరంగా ఉన్న ప్రాంతం

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డులో రక్షణ గోడ దెబ్బతినడంతో చాలా ప్రమాదకరంగా మారింది. లైట్‌హౌస్ మీదుగా జిల్లా పరిషత్ అతిథి గృహం వైపు వెళ్లే మార్గంలో బోయివీధి వద్ద ఎడమ వైపున గోడ కొంత భాగం దెబ్బతింది. అక్కడ మలుపు ఉండడంతోపాటు రోడ్డు ఎత్తుగా ఉంటుంది. దీంతో బీచ్‌వైపు సుమారు పది అడుగులపైనే గొయ్యిలా ప్రమాదకరంగా ఉంది. విశాఖ నుంచి బీచ్‌రోడ్డులో ఇక్కడకు వచ్చే వాహనాలన్నీ ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా భీమిలి నుంచి వెళ్లే సమయంలో ఎడమ వైపునకు గొయ్యి ఉండడం, అక్కడ రోడ్డు మలుపు ఉండడం సమస్యగా మారింది. ఇక్కడ ఎదురుగా వాహనాలు వచ్చే సమయాల్లో వాటిని తప్పించుకునే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల రెండు కార్లు ఇక్కడ ప్రమాదాలకు గురయ్యాయి. పరిస్థితి ఇంత ప్రమాదకరంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి రక్షణ గోడ నిర్మించి ప్రమాదాలు అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కరూర్ వైశ్యా బ్యాంకుతో మేలైన సేవలు



వార్షికోత్సవం సందర్భంగా సేవలు వివరిస్తున్న చీఫ్ మేనేజర్ సుబ్రహ్మణ్యం

తగరపువలస: స్థానిక మెయిన్‌రోడ్డులో ఉన్న కరూర్ వైశ్యా బ్యాంకు బ్రాంచి మొదటి వార్షికోత్సవం సందర్భంగా బుధవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు డివిజినల్ చీఫ్ మేనేజర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ చిరు వ్యాపారులు, రైతులకు అందిస్తున్న సేవింగ్ ఖాతాలు, రుణ సదుపాయాలను వివరించారు. సులభ పద్ధతుల్లో బ్యాంకు కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ అద్దేపల్లి శ్రీసాయిరాం, స్థానిక వ్యాపారులు దేవుళ్ల, గుగ్గిళ్ల చందు, దుంప సాయిరెడ్డి, వెంపాడ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బ్లీచింగ్, సున్నం బస్తాల పంపిణీ



తూడెం పంచాయతీకి సున్నం, బ్లీచింగ్ బస్తాలు అందిస్తున్న దివీస్ లేబొరేటరీ అధికారులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ దివీస్ లేబొరేటరీ యాజమాన్యం బుధవారం చెరకుపల్లి, తూడెం పంచాయతీలకు రూ.21 వేలు విలువైన 16 బస్తాల బ్లీచింగ్, 24 బస్తాల సున్నం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గాలి నరసయ్యమ్మ, రిక్క దుర్గాలమ్మ, దివీస్ లైజనింగ్ అధికారులు ఇ.ఎస్.నాగరాజు, కె.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

రెండు తులాల బంగారం చోరీ

భీమునిపట్నం: భీమిలి చిన్నబజారు జంక్షన్ సమీపంలోని ఇంట్లో బుధవారం రెండు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. దివీస్ కంపెనీలో కలిదిండి నోహార్ అనే వ్యక్తి పని చేస్తుండగా అతని భార్య జ్యోష్న సమీపంలోని సన్‌స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్నారు. వీరి ఇద్దరు పిల్లలు స్కూల్‌కు వెళ్తుంటారు. వీరంతా ఇక్కడ ఒక ఇంట్లోని రెండో అంతస్తులో నివసిస్తున్నారు. ఎప్పటిలాగే భార్య, భర్త ఉద్యోగాలకు, పిల్లలు స్కూల్‌కు బుధవారం ఉదయం వెళ్లిపోయారు. ఈ క్రమంలో జ్యోష్న ఇంటికి తాళం వేయడం మర్చిపోయారు. సాయంత్రం ఆమె వచ్చి చూడగా ఇంట్లోని బీరువాలో రెండు తులాల బరువున్న చెవి దిద్దులు, ఒక గొలుసు, రెండు చేతి ఉంగరాలు చోరీకి గురైనట్టు గుర్తించారు. వెంటనే క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీని గెలిపించి సీఎంకు కానుకగా ఇద్దాం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌ను నియోజకవర్గ నాయకులకు పరిచయం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు వైఎస్సార్‌సీపీ తరపున మొదటి ప్రాధాన్యత ఓటు వేయించి అత్యధిక మెజారిటీతో గెలిపించి ముఖ్యమంత్రి జగన్‌కు కానుకగా ఇద్దామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నియోజకవర్గ పరిశీలకుడు పి.బాలరాజు అన్నారు. మహరాజుపేట కూడలి వద్ద వీఆర్ కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం నియోజకవర్గ పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థి సుధాకర్‌ను నాయకులు, ప్రజాప్రతినిధులకు పరిచయం చేశారు. అనంతరం ముత్తంశెట్టి మాట్లాడుతూ మొదటిసారి పార్టీ పేరు, బి.ఫారంతో జరుగుతున్న ఈ ఎమ్మెల్సీ ఎన్నిక గెలుపు వైఎస్సార్ సీపీకి అత్యంత అవసరమన్నారు. మండలాల వారీగా ఓట్ల లెక్కింపు జరుగుతున్నందున 2024 సాధారణ ఎన్నికలకు పార్టీ బలాబలాలకు దిక్సూచీగా ఈ ఎన్నికలు నిలుస్తాయన్నారు. జాబితాలో ఓటర్లను గుర్తించి ఎన్నిక జరిగే మార్చి 13లోగా కనీసం నాలుగు సార్లు కలిసి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. కాంట్రాక్ట్ లెక్చరర్లకు 12 నెలలూ వేతనాలు చెల్లించడం, ఉద్యోగుల విరమణ వయసు 62 ఏళ్లు, విశాఖ పరిపాలన రాజధాని అయితే ఉత్తరాంధ్ర అభివృద్ధి తదితర విషయాలు వివరించి సుధాకర్‌ను గెలిపించాలని కోరారు.

నాయకులు, కార్యకర్తలదే బాధ్యత

ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గంలో 12,600 ఓట్లలో మన పార్టీ కార్యకర్తలు, నాయకులు చేర్పించినవే 6 వేలు ఉన్నాయన్నారు. సున్నితమైన, సులువైన ఎన్నికలు కాబట్టి అంతా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఇక్కడ తనకు 2 వేల మెజారిటీ ఖాయమన్నారు. చంద్రంపాలెంలో 4, సాగర్‌నగర్‌లో 3, పద్మనాభంలో ఒకటి, ఆనందపురంలో 2, భీమిలిలో 2, తగరపువలసలో ఒకటి చొప్పున పోలింగ్ బూత్‌లు ఉన్నాయన్నారు. ఓటర్లను గుర్తించి పోలింగ్‌కు రప్పించే బాధ్యత నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా తనకు మాత్రమే మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మిగిలిన వారికి ఎలాంటి ప్రాధాన్య ఓట్లూ వేయవద్దన్నారు. ఈ సందర్భంగా పలువురి నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. సమావేశంలో సీనియర్ నాయకుడు కాకర్లపూడి వరహాలరాజు, కార్పొరేటర్ దొలపల్లి ఏడుకొండలు, కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, ఎంపీపీలు దంతులూరి వాసురాజు, కంటుభుక్త రాంబాబు, జెడ్పీటీసీ సభ్యులు గాడు వెంకటప్పడు, కోరాడ వెంకటరావు, నగరాల కార్పొరేషన్ చైర్మన్ పిల్లా సుజాత, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, కోరాడ లక్ష్మణ, అక్కరమాని రామునాయుడు, చిల్ల భాస్కరరెడ్డి, బంటుపల్లి మణిశంకరనాయుడు, శిరుగుడి ఆదిబాబు, గుడ్ల పోలిరెడ్డి, బొట్ట అప్పలరాజు, మొకర అప్పలనాయుడు, పాండ్రంగి శ్రీను, పోతిన శ్రీనివాసరావు, తమ్మిన రామలక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డిపోపై కేసు



డిపోలో బియ్యం పరిశీలిస్తున్న అధికారులు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు భీమిలి బీచ్‌రోడ్డు మంగమారిపేట రేషన్ డిపోలో బుధవారం అధికారులు తనిఖీ చేశారు. డిపోలో పప్పు, బియ్యం పక్కదారి పడుతున్నాయని అందిన ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్లు రమణ, మహేష్ తనిఖీ చేశారు. ఉండాల్సిన నిల్వ కంటే 100 కేజీల పప్పు, 40 కేజీల బియ్యం తక్కువ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గంజాయితో ఇద్దరి అరెస్ట్

తగరపువలస: సంగివలస దివీస్ పార్కు వద్ద భీమిలి సీఐ కె.లక్ష్మణమూర్తి మంగళవారం సాయంత్రం సిబ్బందితో దాడి చేసి ఇద్దరు వ్యక్తుల నుంచి మూడు కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వారికి అందిన సమాచారం మేరకు పార్కు వద్ద మాటు వేయగా భీమిలి మండలం తాటితూరుకు చెందిన రౌడీషీటర్ పతివాడ వినోద్‌కుమార్(27), భీమిలి బ్యాంకు కాలనీకి చెందిన పోతాబత్తుల వెంకటేష్ అలియాస్ బాలు(22)ను అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు.

శివపార్వతుల కల్యాణానికి పెండ్లిరాట



ఆలయం ముందు పెండ్లిరాట వేస్తున్న గ్రామస్తులు

పద్మనాభం: మండలంలోని విలాస్‌ఖాన్‌పాలెం రామలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం సాయంత్రం శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి సర్పంచ్ నల్లి సత్యవతి ఆధ్వర్యంలో గ్రామస్తులు, అర్చకులు బుధవారం పెండ్లిరాట వేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.